# శ్రీ షిరిడీ సాయి వైభవమ్



శ్రద్ధ సబూరి



సాయిదర్బార్, హైదరాబాద్

వ్యవస్థాపకులు, సలహాదారు : సాయిబానిస శ్రీరావాడ గోపాలరావు గారు

నిర్వహణ : ఆత్రేయపురపు త్యాగరాజు, నిజాంపేట, హైదరాబాద్

సంచిక 2 - జనవరి, 2018

## సత్సంగము - రెండు చిన్న కథలు

మనము అప్పుడప్పుడు కాస్త కాస్త సత్సంగము గురించి చెప్పుకుంటున్నాము. ఈ రోజు కూడా సత్సంగము మీద చిన్న కథ, భగవంతుడు మనని అనుసరించుట, చిన్న కథ తెలుసుకుందాము. సత్సంగము మనము సజ్జనులతోనూ, భక్తిభావం ఉన్నవారితోనూ చేయాలి. సత్సంగములో మనము ఒకరికొకరం మన అనుభవాలని, అనుభూతులని, బాబా వారి తత్వాన్ని చర్చింకుటూ ఉండాలి. అప్పుడే మన మనసులో భక్తిభావం పెంపొందుతుంది.

సాయి భక్తులమైన మనము యేది తిన్నా కూడా, తినేటప్పుడు సాయికి నివేదించి తీసుకోవాలి. అన్నం తినేటప్పుడు కూడా, సాయినాథార్పణమస్తు అనుకుంటూ తినాలి. నేను యేది తింటున్నా, లేక ఆఖరికి మంచినీరు తాగుతున్న సాయినాథార్పణమస్తు అనుకుంటూ తీసుకుంటాను. ప్రతి ముద్దకి అన్నం తినేటప్పుడు, సాయినాథార్పణమస్తు, అంటే సాయియే తింటున్నారు అనే భావం.

బాబా లీలలు కాకుండా ఇటువంటి మిగతా విషయాలు రుచిస్తునాయో లేదో తెలియ చేస్తే వీటిని అప్పుడప్పుడు వివరిస్తూ ఉంటాను. లేదా లీలలనె యిస్తూ ఉంటాను.

## సత్సంగమహాత్మ్యం



ఒకసారి ఒక ముముక్షువు కి నారదుల వారు యెదురయ్యారు. ఆయన నారదులవారిని ముక్తికి మార్గం చూపమని అడిగారు. నారదుల వారు సత్సంగము చేయమన్నారు. (ముముక్షువు - సత్యాన్వేషి) ముముక్షువు " సత్సంగము అంటే యెమిటి" అని అడిగాడు. అప్పుడు నారదులవారు, కింద పాకుతున్న పురుగును చూపించి అదిగొ ఆ పాకే పురుగుని అడుగు అన్నారు. ఆ ముముక్షువు "పురుగా పురుగా, సత్సంగము అంటే యేమిటి "అని అడిగాడు. ఆ మాట వింటూనే ఆ పురుగు చచ్చిపోయింది. ముముక్షువు ఆశ్చర్యపోయాడు. అప్పుడు నారదులవారు "అదిగో ఆ యెగిరే పక్షిని అడుగు" అన్నారు. యెగిరే పక్షిని చూసి, "పక్షీ, పక్షీ, సత్సంగము అంటే యేమిటీ" అని అడగ్గానే, ఆ పక్షి ఠపీమని నేలమీద పడి మరణించింది. ఆ ముముక్షువు నిరాశతో "యెమిటిది స్వామీ" అని అడిగాడు. "కంగారు పడకు నాయనా, కొంచెం సేపట్లో యిక్కడికి దగ్గిరలో ఉన్న ఒక రైతు ఇంటిలో ఆవు ఈనడానికి సిద్ధంగా ఉంది, ఆ పుట్టే దూడని అడుగుదువుగాని పద" అన్నారు నారదులవారు. "వద్దు నారదా, ఆ దూడ కూడా మరణిస్తే నాకు గోహత్యా పాతకం చుట్టుకుంటుంది. నేను వెళ్ళిపోతాను" అన్నాడు ముముక్షువు.

"అదెమిటి, సత్సంగము అంటే యేమిటో తెలిసికోకుండానే వెళ్ళిపోతావా? ఒకవేళ ఆ దూడ మరణిస్తే ఆ గోహత్యాపాతకమేదో నేను తీసుకుంటాను సరేనా" అని బయలదేరదీశారు నారదులవారు. రైతు యింటి పశువుల కొట్టంలొ అప్పుడే ఈనిన దూడని "సత్సంగం అంటే నీకు తెలుసా" అని ముముక్షువు అడగగానే ఆ దూడ కాస్తా మరణించింది. ముముక్షువు చాలా బాధ పడ్డాడు. అప్పుడు నారదుల వారు, "ఈ రాజ్యన్నేలే రాజుగారి పట్టమహిషికి కొంచెం సేపటిలొ శిశువు జన్మించబోతున్నాడు. ఆ శిశువుని అడుగుదువుగాని పద" అన్నారు. "అమ్మో! రాజ భవనంలోకా? పైగా అంతః పురంలోకా? అడుగడుగునా రాజ భటులు ఉంటారు" యెలా సాధ్యమవుతుంది అనగానే , నారదులవారు, యేమీ ఫరవాలేదు, నన్ను తలుచుకుని ప్రవెశించు అని చెప్పారు. తరువాత జరిగేది తనకి చెప్పమన్నారు.

ఇద్దరూ రాజభవనం దగ్గిరకి వెళ్ళారు. ముముక్షువు నారదులవారిని తలుచుకుని నిరాటంకంగా అంతఃపురంలోకి వెళ్ళాడు. అక్కడ మహారాణీ వారు మగ శిశువుని ప్రసవించింది. ముముక్షువు ఆ బాలుడుని, సత్సంగము అంటే యెమిటి అని అడిగాడు. అప్పుడు ఆ బాలుని మొహం వింత కాంతితో మెరిసింది. బోసినోటితో చక్కగా నవ్వాడు. తరువాత ముముక్షువు వచ్చి జరిగినదంతా నారదులవారికి చెప్పాడు.

అప్పుడు నారదుల వారు "అదే నాయన సత్సంగ మహత్యం. ఆ బాలుడు యెవరనుకున్నావు? ముందర నువ్వు సత్సంగము అంటే యెమిటి అని పురుగుని అడిగావు చూడు, అదే పురుగు సత్సంగము అనే మాట వినగానె పక్షిగా, దూడగ జన్మించి ఆఖరికి ఉత్తమమైన మానవ జన్మ లభించింది దానికి. అదీ కూడా మహరాజ వంశంలో జన్మించింది. సత్సంగం మాట వింటేనె యింతటి దుర్లభమైన మానవ జన్మ లభించిందే, అటువంటిది సత్సంగము చేస్తే యింకెంత పుణ్యమో అలోచించు" అని నారదులవారు సత్సంగ మహత్యాన్ని వివరించారు.

84 లక్షల జీవరాసులలో మానవ జన్మ అత్యుత్తమమైనది. మరి దీనిని సార్ధకం చేసుకోవాలంటే మనము యేమి చేయాలో అలోచించండి.

## పాద ముద్రలు

ఒకరోజు ఒకానొక వ్యక్తికి ఒక కల వచ్చింది. అతను సముద్రపు ఒడ్డున భగవంతుడితో కలిసి నడుస్తున్నట్లుగా కల గన్నాడు. ఆకాశంలో తన జీవితంలో జరిగిన దృశ్యాలన్నీ కనుల ముందు సాక్షాత్కరించాయి. ఒక్కొక్క దృశ్యంలో అతనికి రెండు జతల పాద ముద్రలు కనిపించాయి. ఒక జత తనది, మరియొక జత భగవంతుడిది.

ఆఖరి దృశ్యం కనిపించినప్పుడు, అతను తన వెనుక యిసుకలో తన వెనుక పాద ముద్రలని చూచాడు. తన జీవిత గమ్యంలో చాలా సార్లు ఒక జత పాద ముద్రలే ఉండటం గమనించాడు. అది తన జీవితంలో నిరాశతోను, దుఖంతోను ఉన్న సమయాలలొ ఉన్నట్లు గమనించాడు.

ఇది అతనిని చాలా కలవరపరిచింది. భగవంతుడిని అడిగాడు.


"ఓ దేవా! ఒకసారి నిశ్చయించుకున్నాక నాకు తోడుగా నాతోనే జీవితమంతా నడుస్తానని చెప్పావు, కాని, నా జీవితంలో కష్టాలు వచ్చినప్పుడు, ఒక జత పాద ముద్రలే ఉన్నాయి. అటువంటి అత్యవసర సమయాల్లో నన్నెందుకు విడిచి వెళ్ళిపోయావొ నాకర్ధమవడం లేదు" అన్నాడు. అప్పుడు భగవంతుడన్నాడు " భక్తా ! నువ్వంటే నాకిష్టం, నేను

నిన్నెప్పుడూ వదలలేదు, నీ కష్టసమయాల్లో నువ్వు బాధలు పడుతున్నప్పుడు నువ్వు ఒక జత పాద ముద్రలే చూశావు, ఆ సమయంలో నేను నిన్ను యెత్తుకుని మోశాను." అని చెప్పాడు.

ఇది కథే కావచ్చు. కాని దీనినుంచి మనము తెలుసుకోవలసినది యేమిటి అని అలోచిస్తే, భవంతుడిని నమ్ముకుంటే ఆయన మనలని యెప్పటికీ విడిచిపెట్టడు. కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోకుండా, అనన్యమైన భక్తిభావంతో సాయినే మనసారా నమ్ముకుని ఆయన నామాన్ని నిరంతరం స్మరిస్తూ ఉంటే, అంతా ఆయనే చూసుకుంటాడు. ఆయనే చెప్పారు కదా, మీభారమంతా నామీద వేయండి, నేను మోస్తాను అని.

సర్వం శ్రీ సాయినాథార్పణమస్తు

## కాకా సాహెబ్ దీక్షిత్ డైరీ – 2 వ.భాగమ్




ఆ డైరీలోని కొన్ని భాగాలు 1977-78 లో శ్రీసాయిలీలా పత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడ్డాయి. ఈడైరీ గురించి, దాని ఆంగ్లానువాదకుడు తన ఉపోద్ఘాతంలో ఇలా వ్రాసుకొన్నారు.

ఈ డైరీ బాబా జీవిత చరిత్రను గురించిన సమాచారాన్నందించే మొట్టమొదటి ఆధారం. పెప్సి యొక్క, యావలిని యొక్క డైరీలు వారివారి కాలాలకు సంబంధించి ఆగ్లేయుల చరిత్ర రచనకు ఎలా ఉపయోగ పడ్డాయో అలాగే శ్రీ ఎం.ఎస్.దీక్షిత్ మరాఠీలోనూ, శ్రీ జీ.ఎస్.ఖపర్డే ఆగ్లంలోను వ్రాసుకొన్న డైరీలు శ్రీసాయి చరిత్రకు విలువైన ఆధారాలు. బాబా లీలలను జాగ్రత్తగా అధ్యయనం చేస్తే సాధకులు తమ గమ్యం చేరడానికి బాబా ఎలా దోహదం చేసేవారో విశద పడుతుంది. దీక్షిత్ డైరీ చదివే ఏపాఠకుడికయినా అదే లక్ష్యం కావాలి. దీక్షిత్ డైరీ ఎంతో విలువైనది. ముఖ్యంగా క్రొత్తగా బాబా రచనలోనికి వచ్చిన భక్తులకు ఇది ఎంతో సహాయకారి. తన భక్తుల యోగక్షేమాల బాధ్యత పూర్తిగా తానే వహిస్తానని బాబా యిచ్చిన హామీ కాకా సాహెబ్ దీక్షిత్ కు మాత్రమే పరిమితం కాదు. కాని, బాబాను ప్రత్యక్షంగా సేవించి అలాంటి రక్షణే పొందిన దాసగణువంటి చాలామంది ఇతర భక్తులు తమ అనుభవాలను తమ అధ్యాత్మిక పురోగతిని డైరీ రూపంలో గ్రంధస్తం చేసుకోకపోవడం శోచనీయం. ఉపాసనీ బాబా కూడా ఎన్నో ఏళ్ళు బాబా పూర్తి సంరక్షణలో ఉన్నారు. కాని దురదృష్ట వశాత్తు ఉపాసనీ బాబా క్రమ బద్ధమైన డైరీ వ్రాసుకోకపోవడమే కాక, తరువాతి రోజుల్లో తాము మొదట ఏసంవత్సరంలో బాబా వద్దకు వచ్చారో బాబా వద్ద ఎంత కాలం ఉన్నారో కూడా మర్చిపోయారు.

ఉదాహరణకు బాబా ఆదేశానుసారం ఉపాసనీ జీవిత చరిత్ర.. ఉపాసనీ లీలామృతం వ్రాసిన రచయిత ఉపాసనీ బాబా నాలుగు సంత్సరాలు బాబా ఆజ్ఞ ప్రకారం షిరిడీలో ఉన్నట్లుగా పేర్కొన్నారు. కాని, ఆతరువాత ఖపర్డే డైరీ, బాలకృష్ణ ఉపాసనీ శాస్త్రి వద్ద వున్న ఉత్తరాల సహాయంతో చేసిన పరిశోధనల వల్ల శ్రీఉపాసనీ మహారాజ్ షిరిడీలో ఉండమని బాబా పెట్టిన నాలుగు సంవత్సరాల గడువు పూర్తి చేయలేదని కేవలం మూడు సంవత్సరాలు మాత్రమే అంటే జూన్ 1911 నుండి జూన్ 1914 వరకు షిరిడీలో ఉన్నారన్న విషయం బయట పడింది. ఆతరువాత ఆయన అంటే శ్రీఉపాసనీ ఎన్నో సందర్భాలలో షిరిడీ సందర్శించినా బాబా విధించిన ఆనాలుగు సంవత్సరాల గడువు మాత్రం పూర్తి చేయలేదు.

ఖపర్డే, దీక్షిత్ డైరీలవంటి ఆధారాల వల్లనే శ్రీసాయి భక్తుల జీవితాలకు సంబంధించిన అధ్యయనంలో యిటువంటి విషయాలు వెలుగులోకి రావడం సాధ్యపడుతుంది. చారిత్రక సత్యాల నిర్ధారణకు యిటువంటి డైరీలు ఎలా ఉపయోగపడతాయో చెప్పడానికి యిది ఒక ఉదాహరణ మాత్రమే. కాని జీవిత చరిత్రలకు సంబంధించిన సంఘటనల నిర్ధారణకే కాక ఈ డైరీల అధ్యయనం వల్ల కొందరు ఎలా తమ ఆరోగ్యం, లౌకిక, ఆధ్యాత్మిక విషయాలలో పురోగతి సాధించారో ఈ డైరీలు చదివిన పాఠకులు గమనించగలరు.

శ్రీ హరి సీతారాం దీక్షిత్ (కాకాసాహెబ్ దీక్షిత్) 1864 సంవత్సరం మధ్య ప్రదేశ్ లోని ఖాండ్వా తాలూకాలో బ్రాహ్మణ వంశంలో జన్మించారు. ఆయన ప్రాధమిక విద్యంతా కూడా ఖాండ్వాలోనూ, హింగన్ ఘాట్ లోనూ జరిగింది. తరువాత ఆయన ముంబాయిలోని ఆల్ఫ్స్ టన్ కాలేజీలో చేరి 19 సంవత్సరముల పిన్న వసులోనే ఎల్.ఎల్.బీ. పట్టా పొందారు.

ఆ తరువాత ఆయన 21 సం.వయసులోనే న్యాయవాది పరీక్షలో విజయం సాధించి లిటిల్ అండ్ కంపెనీలో న్యాయవాదిగా చేరారు. తరువాత తనే స్వంతంగా న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు. తన చురుకైన మేధాశక్తి, తెలివితేటలతో ఎంతో ధనాన్ని ఆర్జించారు. తను సంపాదించిన ధనంతో లోనావాలాలో స్వంతంగా ఒక బంగళా కట్టుకున్నారు. ఆయనకు ఆంగ్ల భాషలోనూ అలాగే, సంస్కృతంలోనూ మంచి ప్రావీణ్యం ఉంది. ఆయన రామాయణం, మహాభారతం, యోగ వాసిష్టం, మరియు జ్ఞానేశ్వరి చదువుతూ ఉండేవారు.

## కాలికి గాయం:

ఒకసారి కాకాసాహెబ్ దీక్షిత్ 1906 వ.సంవత్సరంలో లండన్ వెళ్ళారు. అక్కడ వేగంగా వెడుతూన్న రైలు ఎక్కడానికి ప్రయత్నించినపుడు పట్టుతప్పి ప్లాట్ ఫారం మీద పడిపోయారు. కాలు బెణికి బాగా గాయమయింది. ఈకారణంవల్లే ఆయన సరిగా నడవలేకపోయేవారు. లండన్ లో చాలా రకాలయిన వైద్యాలు చేయించారు. ఆపరేషన్ కూడా జరిగింది. అయినా గాని ఆయన జీవితాంతం వరకూ కుంటుతూనే నడవాల్సి వచ్చింద్. ఈ కాలి కుంటితనమే ఆయన అస్థిరమైన మనసుని స్థిరముగా ఉంచింది. ఆయన కుంటితనమే ఆయనను షిరిడీలో కాలు మోపేలా చేసింది.

మానవుడికి ఏదైనా అనర్థం జరిగినపుడే ప్రతీదానిమీద అయిష్టత ఏర్పడుతుంది. కాని ఒక్కొక్కప్పుడు అటువంటి అనర్థాలే ఎంతో ఉపయోగపడతాయి. కాకాసాహెబ్ తన కుంటికాలితో భారత దేశానికి తిరిగి వచ్చేటప్పటికి ఆయనకు సాయిబాబా గురించి తెలియదు. 1909 సంవత్సరంలో సెలవులు గడపడానికి లోనావాలాలో ఉన్న తన బంగళాకు వెళ్ళారు. అక్కడ తన పూర్వపు సహాధ్యాయి అయిన నానాసాహెబ్ చందోర్కర్ ని కలుసుకొన్నారు. చదువు పూర్తయిన

తరువాత నానాసాహెబ్ చందోర్కర్ ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. కాకా సాహెబ్ దీక్షిత్ స్వంతంగా న్యాయవాది వృత్తిని చేపట్టారు. చాలా సంవత్సరాల తరువాత యిద్దరూ లోనావాలాలో కలుసుకున్నారు.

కాకాసెహెబ్ తన కాలిగురించి నానా సాహెబ్ కి వివరంగా అంతా చెప్పారు.

"మందులన్నీ కూడా పనిచేయడం మానివేసినపుడు భగవంతుని ప్రార్థించే ప్రార్థనలే పని చేస్తాయి" అని నానాసాహెబ్ అన్నారు.

అందుకు కాకాసాహెబ్ "నానా, నేను నీతో పూర్తిగా ఏకీభవిస్తాను. కాని, ఈరోజుల్లో నిజమయిన యోగిపుంగవులు అరుదుగా ఉంటారు. ఒకవేళ అటువంటివారిని కలుసుకోవడానికి అనుకోకుండా అవకాశం వచ్చి విజయం సాధించినా చివరికి పశ్చాత్తాప పడటానికి మాత్రమే.

(ఇక్కడ పాఠకులకి ఒక అనుమానం రావచ్చు. నిజమైన సాధువుని /సత్పురుషుని కలుసుకొంటే పశ్చాత్తాపం పడటమేమిటి అని. ఇక్కడ నేననుకునేది ఏమిటంటే ఒక వేళ మనం నిజమైన సాధువునే కలుసుకున్నామని భావిస్తాము. చివరికి ఆయన నిజమైన సాధువు కాడని తెలిసిన తరువాత మనము పశ్చాత్తాప పడవలసివస్తుందని కాకా సాహెబ్ భావం అయి ఉండవచ్చు) (దీనికి పాఠకులు ఏమంటారు? నాభావం కరక్టేనా? ఇద్దరిని అడిగాను. వారుకూడా ఇదే అభిప్రాయం వెలిబుచ్చారు)

నానా సాహెబ్ ఇలా జబాబిచ్చారు. "ఒక విషయం చెప్పనీ నన్ను. అపుడు నువ్వే నిజంగా నన్ను నమ్ముతావు. నేనొక గురు మహరాజ్ కి శిష్యుడిని. ఆయన పేరు సాయిబాబా. ఆయన కోపర్ గావ్ దగ్గరనున్న చిన్న గ్రామమయిన షిరిడీలో ఉంటారు. నువ్వు ఆయన శరణు పొందు. నీకాలి కుంటితనం నయమవుతుంది. నీయొక్క మనస్సుయొక్క అస్థిరత్వం తొలగిపోతుంది. నా ఆలోచనలని, అభిప్రాయాలని నీకు చెప్పాను. నాగురుమహరాజ్ ఎపుడు చెపుతూ ఉంటారు -- "పిచ్చుక కాలికి దారం కట్టి ఎటువంటి శ్రమ లేకుండానే దానిని మనవద్దకు లాగవచ్చు". అదే విధంగా ఈ ప్రపంచంలో నాభక్తులు ఏమూలనున్నా సరే వారిని నావద్దకు రప్పించుకొంటాను. ఎవరికయితే అదృష్టం లేదో వారికి షిరిడీనుంచి పిలుపు రాదు."

(ఇంకా ఉంది)

# షిరిడీ వార్తలు :

సాయి సమాధి శతాబ్ది సందర్భంగా సాయిబాబా పోస్టల్ స్టాంప్ విడుదల :

శ్రీ షిరిడీసాయి సమాధి శతాబ్ది సందర్భంగా సాయిబాబా ఫోటోతో అయిదురూపాయల విలువ గల పోస్టల్ స్టాంప్ ను న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో డిసెంబరు 15 వ.తేదీన విడుదల చేసారు.

మెగా బ్లడ్ బ్యాంక్ :

షిరిడీ క్షేత్రంలో డిసెంబరు 30 వ.తేదీన షిరిడీసాయిబాబా సంస్థాన్ ఆద్వర్యంలో మెగా బ్లడ్ బ్యాంక్ ను ఏర్పాటు చేసారు.

## సాయిబానిస శ్రీరావాడ గోపాలరావుగారు రచించిన ఆనాటి ఋషులు – నేటి షిరిడీ సాయి నుండి …



## సనాతన ధర్మంలో త్రేతాయుగము, ద్వాపర యుగములోని ఆనాటి ఋషులు, ఈనాటి కలియుగములోని షిరిడీ సాయి

(గత సంచిక తరువాయి)

కపిలముని : ఈయన మహావిష్ణువు అవతారమని సనాతన ధర్మమును పాటించేవారు అని నమ్ముతారు. ఈయనకు ఆధ్యాత్మిక ప్రపంచములో అగ్రస్థానము ఇవ్వబడినది. ఈయన తన భక్తులను అరిషడ్ వర్గాలను నియంత్రించమని కోరినారు. అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు. పుండరీకుడు అను మహారాజు అరణ్యములో వేటాడుతూ ఒక లేడిపై బాణము వేసెను. ఆలేది ఆ బాణము దెబ్బతిని కపిలముని ఆశ్రమములో మరణించెను. కపిలముని పుండరీకునికి అతని తప్పు తెలియచేసి అతనికి వైరాగ్య బోధ చేసెను. ఆ సమయములో పుండరీకుడు ఆత్మహత్యకు సిద్ధపడెను. కపిలముని ఆత్మహత్య మహాపాపమని చెప్పి అతనిని ఆత్మహత్యాప్రయనమును విరమింపచేసెను.

శ్రీసాయి : శ్రీసాయినాధులవారు తర్ ఖడ్ భ్రార్య నుండి ఆరు రూపాయలు దక్షిణ కోరి దానికి బదులు అరిఢడ్ వర్గాలను తన పాదాలపై ఉంచమన్నారు. గోపాల నారాయణ అంబాడేకర్ అబ్ కారి శాకప్లో ఉద్యోగమునకు రాజీనామ చేసిన తరువాత ధనము లేక శ్రీ సాయిని దర్శించుకొని జీవితముపై వైరాగ్యముతో షిరిడీలోని నూతిలో పది ఆత్మహత్య చేసుకొనే ప్రయత్నములో ఉండగా శ్రీసాయి సగుణమేరునాతక్ ను పంపి అక్కల్ కోట మహారాజు చరిత్ర పుస్తకములోని కధ ద్వారా అతని ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమింపచేసెను.

5. అస్థటావక్రముని : ఈ ముని ఎనిమిది వంకరలుగల శరీరముతో జన్మించటము వలన ఈయనకు అష్టావక్రుడు అని పేరుయ్ వచ్ఇనది.  ఈయన పుట్టుకతో ఎనిమిది వంకరలు (అంటే 2 పాదాలు, 2 కాళ్ళు, 2 చేతులు, వెన్నెముక, తల) కారణము ఆయన తన తల్లి సుజాత గర్భములో ఉండగానే తన తాతగారు అయిన ఉద్దలక మహర్షి చెప్పే వేదాలు వినియున్నాడు.  తల్లి గర్భములో ఉండి బయటకు రాకుండా ఉన్న సమయంలో తన తండ్రి అయిన కహోల చెప్పే

వేదాలలోని తప్పులు ఎనిమిది సార్లు తల్లి గర్భంలోనుండి తల్లిని కాళ్ళతో తన్నుతూ చెప్పటము ఆమె తన భర్తకు ఆ తప్పులను తెలియజేయటము, దాని వలని ఆశిశువు తన తండ్రి శాపానికి గురై ఎనిమిది వంకరలతో జనించాదు. ఈయన రామాయణ కాలంలో జనక మహారాజుకు గురువు.  ఆయన జనక మహారాజుకు ఆత్మజ్ఞానమును బోధించెను.

శ్రీసాయి సమర్ధ సద్గురువు.  శ్రీసాయి సత్ చరిత్ర 16 – 17 అధ్యాయములలో శ్రీసాయి తన భక్తులకు బ్రహ్మజ్ఞానము గురించి ఆత్మ సాక్షాత్కారము  గురించి బోధించెను.  ఈనాదు మనము సమర్ధ సద్గురు సాయినాదుని పూజించుట మన అదృష్టము.

(ఇంకా ఉంది)

# సాయి ఉపాసక్ కలం నుండి 

*సాయి బంధువులకు మనవి.*

*జనవరి 2018 సంచిక కొన్ని అనివార్య కారణాల వల్ల విడుదల ఆలస్యమయింది. అన్యధా బావింపవద్దని మనవి చేసుకుంటున్నాను.*

*మన పత్రిక గురించి సూచనలు సలహాలను క్రింద ఇచ్చిన మైల్ ఐ డి కి పంపగలరు. మొదటి సంచిక గురించి కూడా మీ అభిప్రాయాలను తెలపండి.*

*మీ సూచనలు, సలహాలను ఇక్కడ ఇస్తున్న మైల్ చిరునామాకి పంపగలరు*

*saidarbar@gmail.com*

*ఈ పత్రిక ప్రచురణలో నాకు సహాయ సహకారాలను అందిస్తున్న శ్రీ బద్రి నరసింహన్ గారికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.*

*సాయి ఉపాసక్ - త్యాగరాజు*